క్లుప్తంగా

డీఎల్‌పీవోకు సత్కారం



డీఎల్‌పీవో రాఘవన్‌ను సన్మానిస్తున్న అధికారులు

గంగవరం : రంపచోడవరం డీఎల్‌పీవోగా పని చేసి విజయవాడకు బదిలీపై వెళ్లిన రాఘవన్‌ను శుక్రవారం గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాఘవన్ విశేషసేవలందించారని తెలిపారు. ఇన్‌చార్జి డీఎల్‌పీవో నరసింగరావు, ఉపాధి ఏపీవో ప్రకాష్, ఎంఈవో మల్లేశ్వరరావు,సీడీపీవో సీహెచ్.లక్ష్మి, ఏవో సిద్ధేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గర్భిణుల సంరక్షణ కేంద్రాలు మంజూరు



యూ.చీడిపాలెం ఆస్పత్రి

కొయ్యూరు: మండలానికి రెండు గర్భిణుల సంరక్షణకేంద్రాలు మంజూరయ్యాయి. యూ చీడిపాలెం, కంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వీటిని నిర్మించనున్నారు. ఒక్కో కేంద్రానికి రూ.50 లక్షల చొప్పున మంజూరు చేశారు. యూ.చీడిపాలెంలో భవన నిర్మాణానికి శుక్రవారం మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ జేఈ శ్రీవిద్య మాట్లాడుతూ రెండు కేంద్రాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్‌ఐ భూషణం

గంగవరం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, అనుమతులు లేని వస్తువులను తరలించరాదని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని స్థానిక ఎస్‌ఐ భూషణం తెలిపారు. శుక్రవారం స్థానిక హనుమాన్ ఆటో యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పాటించాల్సిన నియమనింబంధనలను వివరించారు.ప్రతి ఆటో డ్రైవర్ జీవిత బీమా పాలసీ చేయించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

యూ.చీడిపాలెంలో మర్రిపాకల రేంజర్ క్వార్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కొయ్యూరు: మర్రిపాకల రేంజర్ క్వార్టర్‌ను యూ చీడిపాలెంలో నిర్మించనున్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్, అటవీశాఖ అధికారులు శుక్రవారం యూ. చీడిపాలెంలో స్థలాన్ని పరిశీలించారు. గతంలో అటవీ అధికారులు నివాసం ఉన్న క్వార్టర్ స్థలంలో రేంజర్ క్వార్టర్‌ను నిర్మించనున్నారు. ఈ క్వార్టర్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరైంది.

రాష్ట్రస్థాయి సదస్సుకు బాలయ్యకు ఆహ్వానం



బాలయ్యకు ఆహ్వానపత్రాన్ని అందిస్తున్న చింతపల్లి శాస్త్రవేత్తలు

గూడెంకొత్తవీధి: వచ్చేనెల 8,9 తేదీల్లో గుంటూరులోని లాంఫాంలో జరగనున్న రాష్ట్ర స్థాయి 54వ సదస్సుకు హాజరుకావాలని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రస్థాయి ప్రాంతీయ వ్యవసా య, విస్తరణ సలహా సంఘం సభ్యుడు(ఆర్‌ఈఏసీ) సభ్యుడు బాలయ్యకు ఆహ్వానం అందింది. డాక్టర్ బాలహు స్పేన్‌రెడ్డి, గూడెంకొత్తవీధి మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు శుక్రవారం ఆహ్వాన పత్రం అందజేశారు. సదస్సులో పాల్గొని సూచనలు అందజేయవలసిందిగా కొత్తూరు గ్రామానికి చెందిన అభ్యుదయ గిరిజన రైతు, ఆర్‌ఈఏసీ సభ్యుడు వండలం బాలయ్యను వారు కోరారు.

మేమేమి చేశాము పాపం? మాకెందుకీ శాపం??

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు దాటినా **పీవీటీజీల** బతుకుల్లో మాత్రం **వెలుగులు** రావడం లేదు. **ఏజెన్సీలో** మారుమూల **ప్రాంతాల్లో** నివసించే వీరికి **కనీస వసతులు** లేక తీవ్ర **ఇబ్బందులు** పడుతున్నారు. **మంచినీటి** సౌకర్యం లేక కలు**షిత నీరు** తాగి అస్వస్థతకు **గురవుతు**న్నారు. ఆస్పత్రి**కి వెళదామన్నా** రోడ్డు, రవాణా **సౌకర్యాలు** లేవు. విద్య, వై**ద్యం,** తాగునీరు, విద్యు**త్, రహ**దారులు, పక్కా **ఇళ్ల వంటి** మౌలిక సదుపా**యాలు కొర**వడి, సమస్యల**తో సతమతం** అవుతున్నారు.

- పీవీటీజీ గ్రామాల గిరిజనుల అరణ్యరోదన
- అభివృద్ధికి ఆమడ దూరంలో బతుకులు
- కొరవడిన మౌలిక సదుపాయాలు
- తాగునీటికి ఊటగెడ్డలే ఆధారం
- మిథ్యగా మారిన విద్య, వైద్యం
- లోవోల్టేజ్ సమస్యతో సతమతం



అభివృద్ధికి నోచుకోని జురిపాడు గ్రామం

మండలం	జనాభా	సమస్యలు
డుంబ్రిగుడ	50,000	తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్ భవనాలు, విద్యుత్, రవాణా
గ్రామాలు	**పీవీటీజీ గ్రామాలు**	
236	67	

డుంబ్రిగుడ: మండలంలోని 236 గ్రామాలుండగా వీటిలో 67 పీవీటీజీ గ్రామాలే. ఈ గ్రామాల్లో నివసిస్తున్న సుమారు 15 వేల మంది గిరిజనుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అన్ని గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల పరిస్థితి కూడా అలాగే ఉంది. ముఖ్యంగా అరమ పంచాయతీ జురిపాడు, సాగర పంచాయతీ టికిలిబెడ్డ, పోతంగి పంచాయతీ పెద్దపాడు గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు.

జురిపాడు..అవస్థలు చూడు



సీసీ రోడ్డు లేని జురిపాడులో వీధి



డ్రైనేజీలు లేని వీధి

పోతంగి పంచాయ తీ జురిపాడులో సుమారు 350 మంద నివసిస్తున్నారు. తాగునీరు, సీసీ రోడ్డు, డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. కొండల్లో ఉన్న ఈ గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి. రోజులో అధిక సమయం విద్యుత్ ఉండదు. ఉన్నా లోవోల్టేజ్ కారణంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ లేదు, తాగునీరు తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. పాఠశాలకు భవనం లేకపోవడంతో రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో ఓ గిరిజనుడి ఇంట్లో నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అరమ నుంచి నడిమివలస మీదుగా జురిపాడు గ్రామం వరకు రోడ్డు నిర్మించారు.

టికిలిబెడ్డ ..ఇక్కట్ల అడ్డ



అభివృద్ధి జాడలేని టికిలిబెడ్డ గ్రామం



టికిలిబెడ్డలో అసంపూర్తి అంగన్‌వాడీ భవనం

సాగర పంచాయతీ టికిలిబెడ్డ గ్రామంలో సుమారు 60 కుటుంబాలకు చెందిన 250 మంది పీవీటీజీలు నివసిస్తున్నారు. ఈ గ్రామంలో 2015లో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని అసంపూర్తిగా విడిచిపెట్టారు. దీంతో పెంకుల షెడ్‌లో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే చిన్నారులు తడిసిముద్దవుతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కొద్దిపాటి వర్షానికే కారిపోతోంది. అలా కారిన నీటిని విద్యార్థులు పాత్రల్లో పట్టి బయటపారబోయవలసి వస్తోంది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు, కొండవాగుల నుంచి వచ్చే కలుషిత నీటినే తప్పనిసరి పరిస్థితుల్లో తాగునీటిగా వినియోగించవలసి వస్తోంది. విద్యుత్ సౌకర్యం ఉన్నా లోవోల్టేజ్‌తో అవస్థలు పడుతున్నారు.

విద్యుత్ సమస్యతో ఇబ్బందులు



గ్రామంలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నాం. వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంటోంది. కొండ ప్రాంతం కావడంతో జంతువులు, పాములు ఇళ్లలో చొరబడుతాయేమోనన్న భయాందోళనలతో గడుపుతున్నాం. అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి.

– సిందరి సాయిప్రసాద్ జుర్రిపాడు, అరమ పంచాయతీ.

వర్షం పడితే పాఠశాలకు సెలవే



గ్రామంలో పాడైపోయిన షెడ్డులో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో పిల్లలకు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనగా ఉంది. పాఠశాలకు భవనం లేక సుమారు 35 మంది విద్యార్థులు రేకుల షెడ్డులో చదువుతున్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియనిస్థితిలో ఆ షెడ్ ఉంది. వర్షం పడితే పాఠశాలకు సెలువు ఇవ్వవలసిందే. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– పాలకి మాలతి టికిలిబెడ్డ గ్రామం, సాగర పంచాయతీ

పెద్దపాడు... సమస్యలే తోడు

పోతంగి పంచాయతీ పెద్దపాడులో సుమారు 100 కుటుంబాల్లో 340 మంది గిరిజనులు నివసిస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. చాపరాయి గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో రోగులను డోలీలో తీసుకువెళ్లాల్సిన దుస్థితి. రేషన్ పొందాలన్నా గెడ్డదాటి డుంబ్రిగుడ వెళ్లాలి. తాగునీరు సౌకర్యం, డ్రైనేజీ, సీసీ రోడ్లు లేవు. లోవోల్టేజీ సమస్య అధికంగా ఉంది.



గెడ్డ దాటుతున్న పెద్దపాడు గ్రామస్తులు



ధ్వంసమైన పెద్దపాడు మెటల్ రోడ్డు



టికిలిబెడ్డలో రేకుల షెడ్లులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు తగవు



చింతూరులో మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయ సంఘం సభ్యులు



హుకుంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



డుంబ్రిగుడలో ఆందోళన చేస్తున్న సచివాలయ సిబ్బంది



జి.మాడుగులలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

హుకుంపేట: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై విశాఖ జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుడు కాకి గోవిందరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, వెంటనే క్షమాపణ చెప్పాలని హుకుంపేట మండల గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చింతూరు: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని రాజకీయ నాయకులు దెబ్బతీయొద్దని ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొడ్డు బలరాం అన్నారు. శుక్రవారం చింతూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం నగర కౌన్సిల్ సమావేశంలో ఓ కార్పొరేటర్ తమను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నామని, తమ బాధ్యతలను ప్రభుత్వం మరింత పటిష్టంగా వినియోగించుకోవాలని కోరుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జోడె నాగేశ్వరరావు, మీడియా కన్వీనర్ గౌతమ్‌రాజు పాల్గొన్నారు.

కించపరిస్తే ఉపేక్షించం

పాడేరురూరల్(అరకులోయరూరల్): తమను కించపరిచే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సచివాలయం ఉద్యోగులు హెచ్చరించారు. జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లకే నానిపాత్రుడు, ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ, చిన్ని, రంజిత్, నాగరాజు, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

డుంబ్రిగుడ: వార్డు సచివాలయ ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు త్రినాథరావు, ఉద్యోగులు సంజీవ్, జయరాజు, రమేష్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

జి.మాడుగుల: విశాఖపట్నం జీవీఎంసీలో గురువారం జరిగిన సమావేశంలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా జి.మాడుగులలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గోవిందరెడ్డి క్షమాపణ చెప్పాలని సచివాలయ సిబ్బంది డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల వెల్లువ



దోనెలపాలెంలో కులధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం అర్జీ సమర్పిస్తున్న గిరిజనులు



దార్రెలలో భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేక అధికారి,ఇన్‌చార్జి డీడీ రజిని

రాజవొమ్మంగి: జిల్లాలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు అర్జీలు వెల్లువెత్తాయి. రాజవొమ్మంగి దోనెలపాలెం, గొబ్బిలమడుగు గ్రామాల్లో స్థానిక తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులోల 38 అర్జీలు స్వీకరించారు. మండలంలోని వాతంగి గ్రామంలో కూడా రెవెన్యూ సదస్సు జరిగింది.

గంగవరం: గ్రామాల్లో గంగవరం మండలం జగ్గంపాలెం , ఓజుబంద గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, జగ్గంపాలెం సర్పంచ్ లీలావతి, ఆర్ఐ లక్ష్మణరావు, సర్వేయర్ వీరపదొర, డీటీ రాంబాబు, వీఆర్వోలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, వెంకన్న, రాజామణి, రామలక్ష్మి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని రెవెన్యూ సదస్సును ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ బి.పి.ఎం.రాజు కోరారు. సాగర పంచాయతీలో నిర్వహించిన సదస్సులో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, గసభ పంచాయతీ లోగిలిలో నిర్వహించిన సదస్సులో ఆర్ఐ రాజు మాట్లాడారు. గసభ సర్పంచ్ సునీత మాట్లాడుతూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వి.బలరామ్, ఉప సర్పంచ్ మహదేవ్, ఈఆర్వోలు రవి, సర్వేయర్లు సద్దు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని గల దార్రెల గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం మండల ప్రత్యేక అధికారి,పాడేరు గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ రజిని ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 41 మంది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీడీ రజిని మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సర్పంచ్ పాండు రంగస్వామి,ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్,ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, డీటీ భూపతిపడాల్,వీఆర్వో శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: రేగులపాడు పంచాయతీ పరిధిలోని తాళ్లగూడెం, బొర్రాయిగూడెంలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 20, రేగులపాడు, కొడేరు గ్రామాల్లో 23 అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ కె. శ్రీనివాసరావు తెలిపారు.

కొయ్యూరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని తహసీల్దారు ఎస్.ఎల్.వి. ప్రసాద్ తెలిపారు.రాజేంద్రపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. సింహాచలం,మాజీ ఎంపీపీ గొలిసింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దారు రవికుమార్ తెలిపారు.శుక్రవారం గొందిపాకు పంచాయతీ పరిధిలో గల ఎర్రవరం,లంబసింగి పంచాయతీ పరిధిలో గల భీమనాపల్లి,అసరాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సుల్లో 63 అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ చెప్పారు.

జీకే వీధి: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహసీల్దారు రామకృష్ణ అన్నారు.దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలసుందరంబాబు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ,సర్పంచ్ సిరబాల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ టౌన్: శిరగాం పంచాయతీ కోడిపుంజువలస, కప్పలగొంది గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్ల మొత్తం 32 వినతులు వచ్చినట్టు తహసీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్ తెలిపారు. మండలంలోని లోతేరు పంచాయతీ కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 53 వినతులు వచ్చినట్టు స్పెషల్ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు.

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని బొర్రా, కోనాపురంలలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 59 వినతులు వచ్చినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ వంతాల మాణిక్యం తెలిపారు. బొర్రా పంచాయతీలో 29, కోనాపురం పంచాయతీలో 30 వినతులు వచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అప్పారావు, రీ సర్వే డీటీ వై.రామ్మూర్తి, ఆర్ఐలు పంచాడి జగ్గయ్యమ్మ, శంకర్‌రావు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, గిరి రైతులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



నెల్లిపాకలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

ఎటపాక: మారేడుమిల్లి పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంపై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లిపాకలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ ఇటువంటి దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. దాడికి పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.సలహాదారు మడివి నెహ్రూ మాట్లాడుతూ పీహెచ్‌సీలలో క్షేత్రస్థాయిలో సిబ్బంది,వసతులు,మందుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పీహెచ్‌సీల వద్ద పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీకి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో సౌందర్య,ఏఎన్‌ఎంలు అన్నపూర్ణ,శ్రీదేవి,పార్వతి, లక్ష్మి,జయ,సంధ్య,రమణి,తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గ్రామాల్లో మలేరియా నివారణకు పటిష్ట చర్యలు



నిల్వనీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో ఏడాదికి నాలుగు సార్లు దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్టు సహాయ మలేరియా అధికారి(ఏఎంవో) సత్యనారాయణ తెలిపారు.యూ.చీడిపాలెం పంచాయతీ పలకజీడిలో ఆయన శుక్రవారం పర్యటించారు. గ్రామంలో రాజుబాబు అనే వ్యక్తికి మలేరియా రావడంతో ఆ ఇంటిని సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గ్రామాలను గుర్తించి, మలేరియా నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి వారం డ్రైడేని పాటించాలని కోరారు.ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు డౌనూరు పీహెచ్‌సీలో 90,రాజేంద్రపాలెంలో 30, యూ. చీడిపాలెంలో 20,కంతారంలో 29 మలేరియా కేసులు నమోదయ్యాయన్నారు.పలకజీడిలో వైద్యులు జయప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని కుండీలు, ఇతర ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించారు.

గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

పాడేరు రూరల్(అరకులోయరూరల్): గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపి, పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాడేరు మండలం చీమలపల్లి గ్రామానికి చెందిన మర్ల సత్యవతి అనే బాలిక మాడుగుల మండలం తాటిపర్తి బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతోందని, ఐదురోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతూ చోడవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని చెప్పారు. వసతి గృహంలో కడుపునొప్పితో బాలిక బాధపడుతుంటే హెచ్‌ఎం, వార్డెన్‌లు దెయ్యం పట్టిందని తీవ్రంగా కొట్టారని, ఆ దెబ్బలు తాళలేక ఆమె మరణించి ఉంటుందని ఆరోపించారు. ఈసంఘటనపై అనకాపల్లి కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థిని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా హనుమత్ వ్రతం

అడ్డతీగల: పవనగిరి క్షేత్రంలో శుక్రవారం హనుమత్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో సువర్చలా సమేత ఆంజనేయస్వామికి సహస్రార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు